జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 13 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 7

## భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలి

- 22.84 లక్షల వ్యయంతో నాలుగు అధునాతన డీజీపీ ఎస్ రోవర్లు
- 70 గ్రామాల్లో కొనసాగుతున్న భూముల రీసర్వే
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 12, (ప్రజా జ్యోతి)** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వే కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో సర్వే పనులు కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతం చేసి, భూ సర్వే పనులు నిర్వహించేందుకు రూ.22.84 లక్షల వ్యయంతో నాలుగు అధునాతన డీజీపీఎస్ (DGPS) రోవర్లను

మిగతా 2 లో...

- కార్పొరేషన్ ఎన్నికల నిధులపై బీజేపీలో కలకలం
- 55 డివిజన్ల అభ్యర్థులకు కేటగిరీల వారీగా నిధుల కేటాయింపు?
- ఏ కేటగిరీకి ఎంత.. అందులో వాటా ఎంత అంటూ ముందస్తు ఒప్పందాల ఆరోపణలు
- పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టి.. ఇష్టమైన వారికి టికెట్ల కేటాయింపుపై విమర్శలు
- జిల్లా అధ్యక్షుడిపై ఫిర్యాదు.. అధిష్ఠానం విచారణ జరిపిందనే సమాచారం
- ఆరోపణల వెనుక మరో నల్లకోట నేత హస్తం ఉందంటూ పార్టీలో చర్చ..
- మరి ఈ ఆరోపణలు సస్టైనబులే' నా..?




## అందరినీ ఏమార్చి.. మొత్తం నొక్కేశారు!?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బీజేపీకి కేడర్ ఉన్నా.. నాయకత్వమే బలహీనమైందనే విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడంలో జిల్లా అధ్యక్షుడు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఒకవైపు ఉండగా.. ఇప్పుడు ఆయనపై ఎన్నికల నిధుల వ్యవహారంలోనూ అవినీతి ఆరోపణలు రావడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

2 లో...

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

### అబ్స్కాండింగ్ కాంతారావు..
## అండర్ అరెస్ట్!




పంజాగుట్ట కేసులో బెంగళూరులో పట్టుకున్న పోలీసులు

ప్రేమ, పెళ్లి హామీతో లైంగిక వేధింపుల ఆరోపణలు

- రియల్ ఎస్టేట్ పెట్టుబడి పేరుతో రూ.4 లక్షలు తీసుకున్నారన్న ఫిర్యాదు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఆగస్టు 12, ప్రజాజ్యోతి:** పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత రేగా కాంతారావును పంజాగుట్ట పోలీసులు బెంగళూరులో అరెస్ట్ చేశారు. యువతి ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో భాగంగా ఈ అరెస్టు జరిగినట్లు తాజా సమాచారం. జూలై 31న కేసు నమోదు కాగా, దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో బెంగళూరులో కాంతారావును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడైంది. దీంతో ఇప్పటి వరకు కేసు నమోదు

మిగతా 2 లో...

## నలుగురు మావోయిస్టుల లొంగుబాటు

- లొంగిపోయిన వారిలో జోనల్ కమిటీ సభ్యుడు సలుకా కాయం
- అతనిపై రూ. 10 లక్షల రివార్డ్

2 లో...



- అశ్వరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై ప్రశ్నార్థకం
- అత్యవసరంగా వచ్చినా వైద్యం కోసం నిరీక్షణ.. సిబ్బంది తీరుపై బాధితుల ఆవేదన
- ప్రత్యక్ష అనుభవాలను వెల్లడించిన రోగులు.. ఉన్నతాధికారుల తనిఖీలపై సందేహాలు
- ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్న వైద్యులు
- ప్రతిబింబిస్తున్న డీసీహెచ్ఎస్ పర్యవేక్షణ లోపం




6 లో..

## ఆరోపణలు ఎన్నో... స్పందన శూన్యం!

## అబ్స్కాండింగ్ కాంతారావు.. అండర్ అరెస్ట్!

(మొదటి పేజీ తరువాయి...)

దర్యాప్తు దశలో ఉన్న వ్యవహారం అరెస్టు వరకు చేరింది. పోలీసులు నమోదు చేసిన కేసు ప్రకారం, 2022లో ఓ యువతికి రేగా కాంతారావుతో పరిచయం ఏర్పడింది. యూట్యూబ్ ఛానెల్ ఏర్పాటు, ఉద్యోగం ఇప్పిస్తాననే అంశాలతో పరిచయం పెంచుకుని, అనంతరం పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని యువతి ఫిర్యాదులో ఆరోపించింది. తన వ్యక్తిగత ఫొటోలను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడ్డారని, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడి పేరుతో రూ.4 లక్షల వరకు తీసుకుని తిరిగి ఇవ్వలేదని కూడా ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఆరోపణల ఆధారంగా పంజాగుట్ట పోలీసులు బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా, తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ రేగా కాంతారావు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై వచ్చిన ఆరోపణలు తప్పుడు ఆరోపణలని, రాజకీయంగా, వ్యక్తిగతంగా తన ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఫిర్యాదు చేశారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నట్లు వార్తా నివేదికలు తెలిపాయి. నాలుగేళ్ల క్రితం జరిగినట్లు చెబుతున్న ఘటనపై ఇప్పుడు కేసు నమోదు చేయడాన్ని కూడా ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఒకవైపు హైకోర్టులో కేసు కొట్టివేయాలన్నక్వాష్ పిటిషన్ కొనసాగుతుండగానే, మరోవైపు పంజాగుట్ట పోలీసులు దర్యాప్తును ముందుకు తీసుకెళ్లి బెంగళూరులో కాంతారావును అరెస్ట్ చేయడం ఈ వ్యవహారంలో కీలక పరిణామంగా మారింది. ప్రస్తుతం అరెస్టు అనంతరం పోలీసులు చేపట్టే తదుపరి చర్యలు, కోర్టులో జరిగే న్యాయ ప్రక్రియపై ఆసక్తి నెలకొంది.

## నలుగురు మావోయిస్టుల లొంగుబాటు

**చర్ల, ఆగస్టు 12 (ప్రజాజ్యోతి):** జార్ఖండ్ లో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భద్రతా దళాలు కీలక విజయం సాధించాయి. ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ప్రభావంతో నిషేధిత సీపీఐ (మావోయిస్ట్)కు చెందిన నలుగురు మావోయిస్టులు మంగళవారం పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా పోలీసులకు, కేంద్ర భద్రతా దళాల సమక్షంలో లొంగిపోయారు. వీరిలో రూ.10 లక్షల రివార్డు కలిగిన జోనల్ కమిటీ సభ్యుడు సలుకా కాయం అలియాస్ భువనేశ్వర్ కూడా ఉన్నాడు. సోనువా పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుడబూరు గ్రామానికి చెందిన సలుకా కాయం మావోయిస్టు సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. లొంగిపోయిన మరో మావోయిస్టు కోడ్ ముని కోడా. టోంటో పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెంగ్రాహతు గ్రామానికి చెందిన ఇతనిపై రూ.లక్ష రివార్డు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అలాగే ముఫుసిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంజెడ్‌బెడ గ్రామానికి చెందిన అనితా తమ్సోయ్ అలియాస్ అనితా కాయం, గోయిల్‌కెరా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇచాగోడ గ్రామానికి చెందిన పింకీ కూడా లొంగిపోయారు. పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలోని సరందా, కోల్హాన్, పహర్‌హాట్ ప్రాంతాలు చాలాకాలంగా మావోయిస్టు కార్యకలాపాలకు ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. తాజా లొంగుబాటుతో ఆయా ప్రాంతాల్లో మావోయిస్టు నెట్‌వర్క్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లు పేర్కొన్నారు. జార్ఖండ్ ప్రభుత్వం అమలు చేస్తున్న లొంగుబాటు, పునరావాస విధా నం ప్రభావం క్షేత్రస్థాయిలో కనిపిస్తోందని అధికారులు తెలిపారు. హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి రావాలనుకునే మావోయిస్టుల కు ప్రభుత్వ విధానం ప్రకారం ఆర్థిక సహాయం, పునరావాస సౌకర్యాలు అందిస్తారు అని అన్నారు. మరోవైపు భద్రతా దళాల నిరంతర గాలింపు, నక్సల్ వ్యతిరేక చర్యలు కొనసాగుతున్నాయి అని ప్రభుత్వ పునరావాస కార్యక్రమాలు, భద్రతా దళాల చర్యలు కలిసి మావోయిస్టు ప్రభావాన్ని తగ్గించడంలో ఫలితాలు ఇస్తున్నాయని యంత్రాం గం పేర్కొంది. తాజాగా నలుగురు మావోయిస్టుల లొంగుబాటును నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో మరో కీలక ముందడుగుగా అధికారులు భావిస్తున్నారు.

## భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

జిల్లాకు సమకూర్చినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 17 డీజీపీఎస్ రోవర్లు అందుబాటులో ఉన్నాయని, రీసర్వే పనులను మరింత వేగవంతం చేసేందుకు తాజాగా మరో నాలుగు రోవర్లను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కలెక్టర్ తెలిపారు . జిల్లాలో ప్రత్యేకంగా ఎంపిక చేసిన 70 గ్రామాల్లో లైసెన్సుడ్ సర్వేయర్ల ద్వారా భూముల రీసర్వే పనులు కొనసాగుతున్నాయని, సర్వే ప్రక్రియలో కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చిన నాలుగు డీజీపీఎస్ రోవర్లను వినియోగించనున్నట్లు తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో భూముల కొలతలను చేపట్టడంతో పాటు సర్వే పనులను వేగంగా పూర్తి చేయడానికి ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో లైసెన్సుడ్ సర్వేయర్లకు జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా నాలుగు డీజీపీఎస్ రోవర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే పనుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలని, నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సర్వేయర్లకు సూచించారు. భూ వివరాల నమోదు, భూముల కొలతలు, సరిహద్దుల నిర్ధారణ తదితర అంశాల్లో పూర్తి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని తెలిపారు. ప్రజలకు భూ సంబంధిత సమస్యలు తలెత్తకుండా రీసర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సర్వే ఏడీ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, లైసెన్సుడ్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

- కార్పొరేషన్ ఎన్నికల నిధులపై బీజేపీలో కలకలం
- 55 డివిజన్ల అభ్యర్థులకు కేటగిరీల వారీగా నిధుల కేటాయింపు?
- ఏ కేటగిరీకి ఎంత.. అందులో వాటా ఎంత అంటూ ముందస్తు ఒప్పందాల ఆరోపణలు
- పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టి.. ఇష్టమైన వారికి టికెట్ల కేటాయింపుపై విమర్శలు
- జిల్లా అధ్యక్షుడిపై ఫిర్యాదు.. అధిష్ఠానం విచారణ జరిపిందనే సమాచారం
- ఆరోపణల వెనుక మరో నల్లకోటు నేత హస్తం ఉందంటూ పార్టీలో చర్చ..
- మరి ఈ ఆరోపణలు సస్టైనబులె' నా..?




# అందరినీ ఏమార్చి.. మొత్తం నొక్కేశారు!?

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బీజేపీకి కేడర్ ఉన్నా.. నాయకత్వమే బలహీనమైందనే విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేయడంలో జిల్లా అధ్యక్షుడు విఫలమవుతున్నారనే ఆరోపణలు ఒకవైపు ఉండగా.. ఇప్పుడు ఆయనపై ఎన్నికల నిధుల వ్యవహారంలోనూ అవినీతి ఆరోపణలు రావడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.**

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

ఇటీవల జరిగిన కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ 60 డివిజన్లలో సుమారు 55 చోట్ల పోటీ చేసింది. పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టి అనుకూలంగా ఉన్న వారికి టికెట్లు కేటాయించారనే ఆరోపణలతో పాటు నిధుల పంపిణీపైనా విమర్శలు వినిపిస్తున్నాయి.

### ››› కేటగిరీల పేరుతో నిధుల వ్యవహారం?

కొత్త గూడెంకార్పోరేషన్ ఎన్నికలలో బిజెపి డివిజన్లను ఏ, బీ కేటగిరీలుగా విభజించి గెలుపు అవకాశాలు, పార్టీ ప్రాధాన్యత ఆధారంగా ఎన్నికల బడ్జెట్ కేటాయించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎన్నికల నిర్వహణకై మొత్తం సుమారు రూ.3.50 కోట్ల వరకు జిల్లాకు నిధులు వచ్చినట్లు సమాచారం. అయితే ఈ మొత్తంలో అభ్యర్థులకు పూర్తిస్థాయిలో డబ్బు చేరలేదని కొందరు ఆరోపిస్తున్నారు. ఏ కేటగిరీ అభ్యర్థికి రూ.8 లక్షలు వస్తే సగం తిరిగి ఇవ్వాలని, బీ కేటగిరీలో రూ.4 లక్షలు వస్తే రూ.2 లక్షలు ఇవ్వాలనే ముందస్తు అవగాహన ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఏ కేటగిరీకి ఎంత కేటాయించారు.. అభ్యర్థులకు ఎంత చేరింది.. మిగిలిన మొత్తం ఎక్కడికి వెళ్లిందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో జిల్లా అధ్యక్షుడితో పాటు ఓ నల్లకోటు నేత పేరు కూడా వినిపిస్తోంది. అయితే ఆరోపణలకు పూర్తి ఆధారాలు, లావాదేవీల వివరాలు బహిర్గతం కావాల్సి ఉంది.

### ››› సీట్లు కావాలంటే.. డబ్బులు?

ఈ ఎన్నికలలో పార్టీ క్రియాశీలక నాయకులు, కార్యకర్తలను పక్కనపెట్టి జిల్లా అధ్యక్షుడి బృందం ఇష్టమైన వారికి టికెట్లు కేటాయించారనే విమర్శలు కూడా ఉన్నాయి. పార్టీతో సంబంధం లేకుండా వచ్చిన ఆశావహుల నుంచి డబ్బులు తీసుకుని సీట్లు ఇచ్చారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పార్టీ గెలుపు అవకాశాలు, క్షేత్రస్థాయి బలం కంటే వ్యక్తిగత సమీకరణాలకే ప్రాధాన్యం ఇచ్చారనే అసంతృప్తి పార్టీలో ఇప్పటికి ఉంది. ఈ వ్యవహారంపై ఇప్పటికే అధిష్ఠానానికి ఫిర్యాదు వెళ్లినట్లు సమాచారం. నిధుల పంపిణీ, టికెట్ల కేటాయింపు, ముందస్తు ఒప్పందాలపై కొందరు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై అధిష్ఠానం విచారణ జరిపినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నా.. విచారణలో ఏం తేలిందనే వివరాలు బయటకు రాలేదు. దీనిపై ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా అధ్యక్షుడి వివరణ కూడా వెలువడాల్సి ఉంది. అయితే అధ్యక్షుడి పై ఇన్ని ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నప్పటికీ చర్యలు ఎందుకు తీసుకోలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు ఆయనకు రెండోసారి పదవి అసలు ఎందుకు ఇచ్చారనే అసంతృప్తి సొంత కార్యకర్తల నుంచే వస్తున్నట్లు సమాచారం.

### ››› చర్యలు లేకపోతే.. పార్టీకి ఎదురుదెబ్బ?

తెలంగాణలో పార్టీ విస్తరణపై బీజేపీ దృష్టి పెడుతున్న సమయంలో జిల్లా నాయకత్వంపైనే ఇలాంటి ఆరోపణలు రావడం కేడర్‌లో అయోమయానికి దారితీస్తోందని కొందరు నాయకులు అంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బీజేపీకి ఓటు బ్యాంకు, కార్యకర్తల బలం ఉన్నప్పటికీ.. నాయకత్వంపై వరుస ఆరోపణలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీసే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నికల నిధులు, టికెట్ల కేటాయింపు, పార్టీ అంతర్గత వ్యవహారాలపై వచ్చిన ఆరోపణలను అధిష్ఠానం పూర్తిస్థాయిలో పరిశీలించి వాస్తవాలను తేల్చాలని పార్టీ వర్గాలు కోరుతున్నాయి. పార్టీని బలోపేతం చేయాల్సిన నాయకత్వమే వివాదాలకు కేంద్రంగా మారితే.. భద్రాద్రిలో బీజేపీ ఎందుకు వెనుకబడుతోంది అనే ప్రశ్నకు అధిష్ఠానం సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందనే చర్చ పార్టీలో సాగుతోంది.

### నల్లకోటు నేతపైనా ఆరోపణల నీడ.. 'సస్టైనబులె' నా..?

ప్రస్తుత జిల్లా అధ్యక్షుడి వ్యవహారాలపై ఆరోపణలతో పాటు గతంలో, ఇప్పుడు జిల్లా స్థాయిలో కీలకంగా వ్యవహరించిన మరో నల్లకోటు నేతపైనా పార్టీలో విమర్శలు ఉన్నట్లు సమాచారం. న్యాయవాది వృత్తిలో ఉన్న ఆ నేత గతంలో బీజేపీ జిల్లా నాయకత్వంలో కీలకంగా వ్యవహరించినప్పటికీ.. అప్పటి, ఇప్పటి రాజకీయ పరిణామాల్లో అందరి నేతలతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటూ సన్నిహిత సంబంధాలు కొనసాగించారనే ఆరోపణలు పార్టీలో వినిపించాయి. ఇందుకు ఉదాహరణగా గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే జలగం వెంకట్రావుకు షాడోగా ఉంటూనే బీజేపీ రాజకీయాల్లో కొనసాగారనే విమర్శలు కూడా ఈ 'మనోహరు'డిపై ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పైగా పార్టీ పేరు, పదవిని వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారనే ఆరోపణలు కూడా గతంలో వినిపించాయని వారు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడిపై వస్తున్న ఆర్థిక, టికెట్ల కేటాయింపు ఆరోపణల వెనుక కూడా ఆ నేత వాటా, ప్రభావం ఉందనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతున్నట్లు సమాచారం. అయితే పార్టీలో 'జి'ల్లా 'వి'ధుల'కే' భ్రష్టు పట్టించేలా ఎంతో కాలంగా కొనసాగుతున్న ఈ నాయకుడు 'మనోహరు'డిపై వాస్తున్న ఈ ఆరోపణలు 'సస్టైనబుల్'నా..? లేక 'అబ్జెక్షన్ ఓవర్‌రూల్డ్'నా..? అన్నది విచారణలో తేలాల్సి ఉంది.

# చర్లలో కలెక్టర్ అంకిత్ పర్యటన

- తాలిపేరు ప్రాజెక్టు పరిశీలన
- నీటి పొదుపుపై సూచనలు
- ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- పాఠశాల వసతులపై ఆరా







**చర్ల, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు, ఏకలవ్య మోడల్ పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా తాలిపేరు ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్ ప్రాజెక్టులోని నీటిమట్టం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, నీటి విడుదల, నిర్వహణ, సిబ్బంది తదితర అంశాలపై ఇరిగేషన్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ప్రస్తుతం ప్రాజెక్టులో 73.80 మీటర్ల నీటిమట్టం ఉందని, పూర్తి స్థాయి నీటిమట్టం 74 మీటర్లు అని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతం నుంచి ప్రధానంగా ప్రాజెక్టుకు నీటి ప్రవాహం వస్తుందని గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇన్‌ఫ్లో తక్కువగా ఉందని తెలిపారు. ప్రస్తుతం నీటి ప్రవాహం పెరుగుతూ, తగ్గుతూ స్థిరంగా లేకుండా కొనసాగుతోందని, బుధవారం సు మారు 2,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని వివరించారు. రానున్న రోజుల్లో ఇన్‌ఫ్లో మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు విడుదల చేస్తున్న నీటి వివరాలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఎడమ కాలువ ద్వారా 200 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 30 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.తాలిపేరు ప్రాజెక్టు ద్వారా సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతున్నట్లు వివరించారు. ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన సిబ్బంది, గేట్లు, ఇతర యంత్రాంగం పనితీరుపై కలెక్టర్ ఆరా తీశారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, గేట్ ఆపరేటర్లు, పంప్ ఆపరేటర్లను శాశ్వత ప్రాతిపదికన కేటాయించాలని అధికారులు కలెక్టర్‌ను కోరారు.అనంతరం ప్రాజెక్టు కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ గేట్ల నిర్వహణ, నీటిమట్టం, నీటి ప్రవాహాన్ని పర్యవేక్షిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. ప్రాజెక్టు గేట్లు, కంట్రోల్ రూమ్, ఇతర యంత్రాంగం నిరంతరం పనిచేసేలా అవసరమైన నిర్వహణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.అనంతరం చర్లలోని ఏకలవ్య మోడల్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, పాఠశాల వసతులు, భోజనం, వైద్య సేవలు, పరిశుభ్రత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని తెలుసుకోవడంతో పాటు విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగారు. వారి అభ్యాసన సామర్థ్యాన్ని తెలుసుకునేందుకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను పరిశీలించి కొంతమంది విద్యార్థులతో పుస్తకాలు చదివించారు.పాఠశాల కిచెన్‌ను పరిశీలించిన కలెక్టర్ వంటగది పరిశుభ్రత, వంట చేసే విధానం, ఉపయోగిస్తున్న కూరగాయలు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతున్నదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భోజనం నాణ్యత,రుచి, పరిమాణంపై విద్యార్థులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన, పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు.పాఠశాల ఆవరణలోని హెల్త్ సెంటర్‌ను కూడా కలెక్టర్ పరిశీలించారు. అందుబాటులో ఉన్న మందులు, మందుల నిల్వ, విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షల వివరాలను ఏఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌తో పాటు పాఠశాలలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులను పరిశీలించి వివరాలను సరి చూశారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తాగునీటికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్‌లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకునేలా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాజెక్టులో నీటిమట్టం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోను నిరంతరం పర్యవేక్షిస్తూ, నీటి ప్రవాహంలో మార్పులను ఎప్పటికప్పుడు గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.విద్యార్థుల విద్యా ప్రమాణాలు, ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో బోధించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు పాఠ్యాంశాలను కేవలం కంఠస్థం చేయకుండా విషయాన్ని అర్థం చేసుకుని నేర్చుకునేలా బోధనా పద్ధతులను మెరుగుపరచాలని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. పాఠశాల తరగతి గదులు, వంటగది, హెల్త్ సెంటర్, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.ఈ పర్యటనలో చర్ల తహసీల్దార్ శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఎంపీడీవో ఈదయ్య, సిడిపిఓ అధికారి రేవతి,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో తిరంగా ర్యాలీ



**ఇల్లందు, ఆగస్ట్ 12 (ప్రజా జ్యోతి)** బిజెపి ఇల్లందు మండల అధ్యక్షుడు భట్టు రమేష్ ఆధ్వర్యంలో బుధవారం మాస్టర్ మైండ్స్, సరస్వతి విద్యాలయం విద్యార్థులతో కలిసి తిరంగా ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ నిర్వహించినట్లు భట్టు రమేష్ తెలిపారు. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు "ముందు దేశం తర్వాతే మనం" భావం యువతలో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన విధ్యాసంస్థల అధ్యాపక బృందలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బాలగాని గోపి కృష్ణ, జిల్లా కార్యదర్శి సేనాపతి మురళి కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రాంచందర్, మండల ప్రధాన కార్యదర్శులు రాజేష్, మధు, మండల ఉపాధ్యక్షులు శ్రీకాంత్, పవన్, వంశీ, బుచ్చయ్య, కృష్ణ, లక్ష్మీనర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## ఎఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ వేడుకలు



**ఆళ్ళపల్లి. ఆగస్టు12(ప్రజా జ్యోతి)** ఆళ్ళపల్లి మండల పరిధిలో మర్కోడు పంచాయతీ కేంద్రంలో బుధవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా (ఎఐఎస్ఎఫ్) మండల కార్యదర్శి తాళ్లపల్లి వినయ్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కొమరం హనుమంతరావు కలిసి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కొమరం హనుమంతరావు మాట్లాడుతూ.. 1936 ఆగస్టు 12న లక్నోలో విద్యార్థుల హక్కులు, దేశ స్వాతంత్ర్యమే లక్ష్యంగా (ఎఐఎస్ఎఫ్) ఆవిర్భవించిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో అనేక మంది విద్యార్థులు త్యాగాలు చేశారని, అనంతరం ప్రభుత్వ విద్య పరిరక్షణ, శాస్త్రీయ విద్య, సమాన విద్యా విధానం కోసం (ఎఐఎస్ఎఫ్) నిరంతరం పోరాడుతోందన్నారు.తెలంగాణ రైతాంగ పోరాటం, విశాఖ ఉక్కు ఉద్యమం, 18 ఏళ్లకే ఓటు హక్కు, హాస్టళ్ల సమస్యలు, మలిదశ తెలంగాణ ఉద్యమం తదితర అనేక పోరాటాల్లో ఎఐఎస్ఎఫ్ కీలక పాత్ర పోషించిందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్ లోనూ సమరశీల పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు రహీం, రమేష్, ఆరిఫ్, శివ, ఆకాష్, రమేష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగుంట గ్రామస్తులకు పోలీసుల దుస్తుల పంపిణీ



**పినపాక,ఆగష్టు 12(ప్రజాజ్యోతి)** పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఎర్రగుంట గ్రామస్తులకు దుస్తులు పంపిణీ చేశామని సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ సురేష్, సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, పోలీస్ శాఖ ద్వారా వీలైనంత సహాయ సహకారాలు అందిస్తామని సీఐ తెలిపారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు.

## తేగడ పాఠశాల భవనం పూర్తి చేయాలి

- అసంపూర్తి భవనం వద్ద యువత నిరసన
- అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్



**చర్ల, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని తేగడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన అదనపు తరగతి గదుల భవనం నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం విద్యార్థులతో కలిసి స్థానిక యువత నిరసన చేపట్టింది. తరగతి గదుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు తక్షణమే స్పందించి నిర్మాణాన్ని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు.గ్రామస్తుల వివరాల ప్రకారం 2020–21 సంవత్సరంలో ఎఫ్ఎఫ్‌సీ నిధుల నుంచి రూ.16 లక్షలు మంజూరు చేసి అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు అని అయితే నిర్మాణం ప్రారంభించిన అనంతరం భవనం పైన విద్యుత్ లైన్ ఉండటాన్ని గుర్తించడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి అని నిర్మాణానికి ముందే స్థలాన్ని, విద్యుత్ లైన్ల పరిస్థితిని పరిశీలించకుండా పనులు ప్రారంభించడంతోనే ఈ సమస్య తలెత్తిందని గ్రామస్తులు ఆరోపించారు.పాఠశాల ఆవరణలో తగినంత స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ సరైన ప్రణాళిక లేకుండా నిర్మాణ పనులు చేపట్టడం వల్ల ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేసేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించి విద్యార్థుల తరగతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా యువ నాయకుడు పెద్దిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరారు. యువ న్యాయవాది పరిటాల సంతోష్ మాట్లాడుతూ భవన నిర్మాణం ఎందుకు మధ్యలోనే నిలిచిపోయిందనే అంశంపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో పాటు శ్రీను, రాజు, పెద్దిరెడ్డి, నిరంజన్, నవీన్, పరిటాల సంతోష్, మద్ది లక్ష్మీనరసింహారెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

## పెదమిడిసిలేరు హాస్టల్‌లో వైద్య శిబిరం



**చర్ల, ఆగస్టు 12(ప్రజా జ్యోతి):** చర్ల మండలం సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదమిడిసిలేరు బాలికల హాస్టల్‌లో వైద్యాధికారి డాక్టర్ సందీప్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని బాలికలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.వైద్య పరీక్షల్లో ఏ విద్యార్థినికీ జ్వరం లేదని వైద్య సిబ్బంది తెలిపారు. జలుబు, దగ్గు, దురద వంటి సాధారణ ఆరోగ్య సమస్యలు ఉన్న 42 మంది విద్యార్థినులకు అవసరమైన మందులు అందజేశారు. ద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఎల్లప్పుడూ శుభ్రమైన నీటిని మాత్రమే తాగాలని వైద్య సిబ్బంది సూచించారు. గోళ్లను చిన్నగా ఉంచుకోవడంతో పాటు ఆహారం తీసుకునే ముందు, మరుగుదొడ్డిని ఉపయోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. శుభ్రమైన దుస్తులు ధరించాలని సరైన పద్ధతిలో చేతులు కడుక్కోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని వివరించారు.హాస్టల్ పరిసరాలు, మరుగుదొడ్లను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచాలని సూచించారు. వంట చేసే ప్రదేశంలో పరిశుభ్రత పాటించాలని వంట చేసే సమయంలో ఆహారాన్ని వడ్డించే సమయంలో చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కున్న తర్వాతే విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. రోజువారీగా వినియోగించే ఆహార పదార్థాలు కూరగాయలు తాజాగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు.విద్యార్థినుల ఆరోగ్యంపై హాస్టల్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఏవైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి సమాచారం అందించాలని వైద్య సిబ్బంది సూచించారు.ఈ వైద్య శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ సందీప్, హెచ్ ఈ ఓ బాబురావు, ఎం ఎల్ హెచ్ పీ దీప్తిమౌనిక, హెల్త్ అసిస్టెంట్ సుబ్బారావు, హెచ్ ఏం సామ్రాజ్యం, ఏఎన్ఎం మౌనిక, ఆశా కార్యకర్త కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ భూముల రక్షణకు నిరాహార దీక్ష



**చర్ల, ఆగస్టు 12(ప్రజా జ్యోతి):** చర్ల మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం సమీపంలో సర్వే నంబర్ 117లో ఉన్న శ్రీశ్రీశ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయ భూములను ఆక్రమణల నుంచి రక్షించాలని డిమాండ్ చేస్తూ మహారుద్ర సేన వ్యవస్థాపకుడు కొండా చరణ్ బుధవారం ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకునే వరకు దీక్ష విరమించేది లేదని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కొండా చరణ్ మాట్లాడుతూ సుమారు రెండేళ్ల క్రితం కొందరు వ్యక్తులు ఆలయ భూమిని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారని ఆరోపించారు. ఈ విషయంపై గత రెండేళ్లుగా రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు, వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు ఆక్రమణదారులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ నోటీసులు జారీ చేస్తామని, నివేదిక రూపొందిస్తామని చెప్పడం తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని విమర్శించారు.ఆక్రమణలపై అధికారులు సకాలంలో చర్యలు తీసుకోకపోవడంతో ఆక్రమణదారులు అక్కడే నివాసం కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఆలయ భూములకు రక్షణ కల్పించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ, దేవాలయ భూములను పరిరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆలయ భూముల విషయంలో నిర్లక్ష్య వైఖరి హిందూ సమాజ మనోభావాలను దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆలయ భూముల పరిరక్షణ కోసం చేపట్టిన నిరాహార దీక్షకు మండల ప్రజలు, దేవాలయ కమిటీలు, ప్రజా సంఘాలు మద్దతు ఇవ్వాలని కొండా చరణ్ కోరారు. సమస్య పరిష్కారమయ్యే వరకు దీక్ష కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ దీక్షకు శ్రీశ్రీశ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయ కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. చర్ల మండల యువజన నాయకుడు, న్యాయవాది పరిటాల సంతోష్, లోక్ రక్షక్ పార్టీ నాయకుడు కొండా ప్రమోద్, మహిళా రక్షక్ సంఘ్ జిల్లా అధ్యక్షురాలు చిట్టిమల్ల సుజాత, మైనారిటీ రక్షక్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కె. భాష తదితరులు దీక్షకు మద్దతు తెలిపారు.

# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- **మండల తాసిల్దార్ కి వినతి పత్రం అందజేత**




**చర్ల, ఆగస్టు 12:(ప్రజా జ్యోతి):** ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బి. మురళీమోహన్, ఉపాధ్యాయ సంఘం నాయకుడు పి. నాగేశ్వరరావు, వి. బాలకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 7న పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపామని, 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేస్తున్నట్లు అన్నారు . 19న జిల్లా కేంద్రాల్లో ధర్నా, 29న రాష్ట్ర రాజధానిలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే శాసనసభ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యోగుల పరిస్థితిలో ఆశించిన మార్పు రాలేదని నాయకులు విమర్శించారు. గత ప్రభుత్వం 22 నెలల వేతన సవరణ సంఘం కాలాన్ని నిర్లక్ష్యం చేసిందని ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 37 నెలలు గడుస్తున్నా వేతన సవరణపై స్పష్టత ఇవ్వడం లేదని అన్నారు. వెంటనే వేతన సవరణ సంఘం నివేదికను తీసుకుని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించి ప్రస్తుతం అమలులో ఉన్న నూతన పింఛను విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఉపాధ్యాయుల పోరాటానికి ప్రజలు కూడా భాగస్వాములు కావాలని నాయకులు కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు కేవలం ఉద్యోగుల సమస్యలు మాత్రమే కాదని అవి విద్యార్థులు, విద్యారంగానికి సంబంధించిన సమస్యలేనని అన్నారు . యువత కూడా ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను భారీగా తగ్గించే ప్రతిపాదనలు గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. దూరప్రాంతాల్లో ఉన్న పాఠశాలలు మూతపడితే గిరిజన విద్యార్థులకు విద్య అందుబాటులో లేకుండా పోయే ప్రమాదం ఉందన్నారు. పాఠశాలల సంఖ్యను తగ్గించే చర్యలను నిలిపివేసి ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు.కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు దశాబ్దాలుగా సేవలందిస్తున్నప్పటికీ వారికి తగిన వేతనాలు అందడం లేదని అన్నారు. వారికి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పి. నాగేశ్వరరావు, వి. బాలకృష్ణ, వసంత, పి. రాధ, టి. జలంధర్, సావిత్రి, యడమరాజు, హిమగిరి, ఎస్. బాలకృష్ణ, బి. సర్వేశ్వరరావు, ప్రదీప్, చిట్టిబాబు, రామారావు, జయప్రకాష్, రవి, స్వర్ణలత, ప్రవల్లిక, అమ్మాజి, సమ్మక్క, సుజాత, వరలక్ష్మి , కృష్ణయ్య, వీర్రాజు, తాటి నరసింహారావు, జయలక్ష్మి , లక్ష్మీదేవి, పద్మావతి, హరిబాబు, రవికిషోర్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పి. నరసింహారావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- **పనులకు అడ్డంకులు సృష్టిస్తే రైతులకే నష్టం**
- **ఓరుగంటి రమేష్**



**అశ్వాపురం, ఆగస్టు,12 ,ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం అశ్వాపురం మండలం పరిధిలోని తుమ్మలచెరువు ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన మారేళ్లపాడు పనులను వేగవంతం చేస్తోందని అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ తెలిపారు. అయితే కొన్ని ప్రతిపక్ష పార్టీలు పనులకు అడ్డంకులు సృష్టిస్తూ జాప్యానికి కారణమవుతున్నాయని ఆయన ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపక్షాలు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు.అశ్వాపురం మండల కేం ద్రంలోని ఓరుగంటి వీరయ్య భవన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తుమ్మలచెరువు ఆయకట్టు పరిధిలోని రైతులకు త్వరితగతిన సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు.మారేళ్లపాడు పనులు పూర్తయితే ఆయకట్టు రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని, సాగునీటి సమస్యకు కొంత మేర పరిష్కారం లభిస్తుందని రమేష్ అన్నారు. రైతులకు నీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో పనులు సజావుగా కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు.అయితే కొందరు ప్రతిపక్ష నాయకులు రాజకీయ లబ్ధి కోసం రైతులను ముందుపెట్టి పనులను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సుమారు 150 మీటర్ల మేర పనులు నిలిచిపోవడంతో పనుల పురోగతిపై ప్రభావం పడుతోందన్నారు. పనులు ఆలస్యమైతే చివరకు నష్టపోయేది రైతులేనని, దీనిని ప్రతిపక్షాలు గుర్తించాలని సూచించారు.ప్రభుత్వాన్ని విమర్శించేందుకు రైతుల సమస్యలను రాజకీయ అంశంగా మార్చడం సరికాదన్నారు. ప్రతిపక్ష నాయకులకు నిజంగా రైతులపై చిత్తశుద్ధి ఉంటే తమతో కలిసి వచ్చి రైతులతో మాట్లాడి పనులు త్వరగా పూర్తయ్యేలా సహకరించాలని రమేష్ కోరారు. ఎలాంటి అపోహలు ఉన్నా అధికారుల సమక్షంలో చర్చించుకుని పరిష్కరించుకోవచ్చన్నారు.ఆగస్టు 15న మోటార్ల డ్రైరన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని రమేష్ తెలిపారు. నిర్ణయించిన ప్రకారం పనులు పూర్తిచేసి రైతులకు త్వరలోనే సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా రైతుల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గదన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉసా అనిల్, ఆవుల రవి, మట్టె భద్రారెడ్డి, గాదె వెంకటరెడ్డి, లంక మల్ల కొండలరావు, రావులపల్లి నరసింహారావు, గొల్లపల్లి నరేష్, జినుగు రాము తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

- **ఉపాధ్యాయుల సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ కు మెమోరాండం**



**ఆళ్ళపల్లి,ఆగస్టు12(ప్రజా జ్యోతి)** ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో రెండో దశ పోరాట కార్యక్రమంలో భాగంగా ఆళ్లపల్లి తహసీల్దార్ గడ్డం ఉమారాణికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు మెమోరాండం అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జోగ రాంబాబు,టీఎస్ యూటీఎ ఫ్ జిల్లా కార్యదర్శి ఇస్లావత్ హతిరామ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. (పిఆర్ సి) నివేదికను తెప్పించి 1-7-2023 నుంచి అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న డీఏలు విడుదల చేయాలని,(సిపిఎస్) రద్దు చేసి( ఓపిఎస్) పునరుద్ధరించాలని కోరారు. పాఠశాలల మూసివేత ఆలోచనను విరమించుకోవాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేసి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలని, కేజీబీవీ,యూఆర్ఎస్. సమగ్ర శిక్ష, కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతామని తెలిపారు.కార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల అధ్యక్షుడు బానోతు బోజ్యా, టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అగ్గి రామకృష్ణతో పాటు రామయ్య, రామకృష్ణ, బద్రు, రామ్ చందర్, బావ్ సింగ్, వెంకటేశ్వర్లు, వీరన్న, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ ప్రజా చైతన్య యాత్ర

- ప్రజల సమస్యలపై నిరంతర పోరాటం కొనసాగిస్తాం
- సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సాబీర్ పాషా







**దమ్మపేట,ఆగష్టు. 12,(ప్రజా జ్యోతి):** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజా చైతన్య యాత్ర బుధవారం దమ్మపేట మండల కేంద్రానికి చేరుకుంది. యాత్రకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కామ్రేడ్ యార్లగడ్డ భాస్కర్‌రావు విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కార్యదర్శి సుంకిపాక ధర్మ అధ్యక్షతన నిర్వహించిన సభలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రజలను చైతన్యపరిచి, వారి హక్కుల కోసం ఐక్యంగా పోరాడటమే యాత్ర లక్ష్యమన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.దమ్మపేట మండలంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారించాలని సాబీర్ పాషా కోరారు. మండలంలో జూనియర్ కళాశాల లేక విద్యార్థులు పక్క మండలాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఉందని, గతంలో ప్రజలకు ఉపయోగపడిన బస్టాండ్ ప్రస్తుతం నిరుపయోగంగా మారిందని తెలిపారు. పోడు భూముల సమస్యలను పరిష్కరించి అర్హులైన గిరిజన, ఆదివాసీ రైతులకు హక్కులు కల్పించాలని, పోడు రైతులపై అటవీ శాఖ నమోదు చేస్తున్న కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఎజెండాను విస్మరించే పాలకులపై ప్రజల తరపున సీపీఐ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. "సీపీఐ ఎవరి పక్షం కాదు.. ప్రజల పక్షం" అని సాబీర్ పాషా అన్నారు. ప్రజల మేలు, భద్రత, హక్కుల సాధన కోసం ఎర్రజెండా ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సెప్టెంబర్ 1న 'చలో ఢిల్లీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'చేంజ్ ఇండియా.. సేవ్ ఇండియా' నినాదంతో దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, సారెడ్డి పుల్లారెడ్డి, ఉప్పుశెట్టి రాహుల్, ఫాయిమ్ మున్నా, లక్ష్మీకుమారి, వేల్పుల మల్లికార్జున, సీపీఐ మండల కార్యదర్శి సుంకిపాక ధర్మ, సహాయ కార్యదర్శి యార్లగడ్డ మణికంఠ, యార్లగడ్డ ఈశ్వరరావు, తంగెళ్ల శివకృష్ణ, బెజవాడ రాము, నక్క నాగమణి, గాజుబోయిన కృష్ణవేణి, నల్ల ప్రసాద్, కూకలకుంట సత్యనారాయణ, వీరాస్వామి, అశోక్, మురళి, జానీబేగం, దేవదాసు తదితర సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై గళమెత్తిన సీపీఐ

- ఘనంగా ప్రజా చైతన్య యాత్ర ముగింపు
- ప్రధాన కూడలి మీదుగా ర్యాలీ.. రింగ్ సెంటర్ లో బహిరంగ సభ

**అశ్వరావుపేట:** ప్రజా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా చైతన్య యాత్ర ముగింపు కార్యక్రమం అశ్వరావుపేటలో ఉత్సాహంగా జరిగింది. సీపీఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సిపిఐ ఆఫీసు నుండి బస్టాండ్ వరకు ర్యాలీగా బయలుదేరి అనంతరం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న చిన్న రింగ్ సెంటర్ కు చేరుకుని అక్కడ బహిరంగ సభ నిర్వహించారు.

### ››› ప్రజా సమస్యలపై పోరాటమే లక్ష్యం...

ర్యాలీ సందర్భంగా నాయకులు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు మరింత చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పథకాల అమలు, స్థానిక అభివృద్ధి అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడమే యాత్ర ప్రధాన ఉద్దేశ్యమని నాయకులు పేర్కొన్నారు.

### ››› సభలో సాబీర్ పాషా ప్రసంగం....

చిన్న రింగ్ సెంటర్ వద్ద నిర్వహించిన సభలో సాబీర్ పాషాతో పాటు పలువురు సీపీఐ నాయకులు ప్రసంగించారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందని, ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

### ››› ర్యాలీకి భారీగా కార్యకర్తల హాజరు....

సీపీఐ జెండాలు చేతబట్టి నినాదాలతో కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్రం నుంచి బస్టాండ్ మీదుగా సాగిన ర్యాలీతో ప్రధాన రహదారిలో సందడి నెలకొంది. అనంతరం రింగ్ సెంటర్ వద్ద నాయకులు, కార్యకర్తలు సమావేశమై ప్రజా సమస్యలపై తమ గళాన్ని వినిపించారు.

**ప్రధాన డిమాండ్లు....ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలి.స్థానిక మౌలిక వసతులను మెరుగుపరచాలి.నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి.ప్రజా సమస్యలపై అధికార యంత్రాంగం స్పందించాలి.ప్రజా ఉద్యమాలకు మరింత బలం**

ప్రజా చైతన్య యాత్ర ముగిసినా ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని సీపీఐ నాయకులు స్పష్టం చేసినట్లు తెలిపారు. ప్రజలను భాగస్వాములను చేస్తూ భవిష్యత్ లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.




## 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ

- అత్యవసర సేవల్లో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచన



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలానికి సంబంధించిన 108 అంబులెన్స్‌ను ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యక్రమ నిర్వాహకుడు నజీరుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లోని రికార్డులు, ఔషధాలు, వైద్య పరికరాలు, వాటి గడువు తేదీలను క్షుణ్ణంగా పరిశీలించారు. పరికరాల పనితీరుతో పాటు వాహన నిర్వహణకు సంబంధించిన పత్రాలను కూడా తనిఖీ చేశారు.అత్యవసర సమయాల్లో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా సిబ్బంది ప్రతి క్షణం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని నజీరుద్దీన్ సూచించారు. 108 అంబులెన్స్ సేవలను ప్రజలు అత్యవసర సమయాల్లో సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ తనిఖీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమన్వయకర్తలు మనోహర్, సతీష్, ఈఎంటి కళాధర్, పైలెట్ రాజా పాల్గొన్నారు.

## ప్రజా సమస్యకు పరిష్కార బాటలు

- తుప్పపట్టిన ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త సిమెంట్ స్తంభాలు



**బూర్గంపహాడ్, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల కేంద్రంలో ఏళ్లుగా ప్రమాదకరంగా మారిన పాత ఇనుప విద్యుత్ స్తంభాల సమస్యకు పరిష్కారం లభించింది. తుప్పుపట్టి ఎప్పుడు కూలుతాయోనన్న ఆందోళన కలిగిస్తున్న స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఉపసర్పంచ్ గుండె వెంకన్న ప్రజల సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఏఈ వెంకటేశ్వరరావు చొరవ తీసుకుని తక్షణమే మరమ్మతు పనులు చేపట్టారు. ఎల్ఐ తోటమళ్ల సురేష్ ఆధ్వర్యంలో స్తంభాల మార్పిడి పనులు చేపట్టారు. దీంతో విద్యుత్ షాక్, వైర్లు తెగిపడటం వంటి ప్రమాదాల ముప్పు తగ్గనుందని అధికారులు తెలిపారు.ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యను చొరవతో పరిష్కరించిన విద్యుత్ అధికారులకు, ఉపసర్పంచ్ గుండె వెంకన్నకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## చర్లలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



**చర్ల, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన చర్ల మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్), ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) నాయకులు బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు. చర్ల మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్‌ను కలిసి విద్యార్థుల సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా పీవైఎల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షుడు కామ్రేడ్ ముసలి సతీష్ మాట్లాడుతూ చర్ల మండలంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ప్రాంత అభివృద్ధికి చర్లలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.డిగ్రీ విద్య కోసం విద్యార్థులు భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఆర్థిక స్తోమత లేని పేద, గిరిజన విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడం కష్టంగా మారడంతో చాలామంది ఇంటర్మీడియట్‌తోనే చదువు నిలిపివేస్తున్నారని అన్నారు . చర్లలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే మండలంతో పాటు చుట్టుపక్కల మారుమూల గ్రామాల విద్యార్థులకు కూడా ఎంతో ప్రయోజనం కలుగుతుందని చర్లలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని గతంలో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వినతులు సమర్పించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ప్రస్తుత జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రత్యేక చొరవ తీసుకుని చర్ల మండలంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేలా ప్రభుత్వం నుంచి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ అంకిత్ సమస్యను పరిశీలించి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గొంది ముయ్యన్న, సంతపూర్ సురేష్, ప్రసాద్, శ్రీను, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి జయంతి వేడుకలు

**దమ్మపేట,ఆగష్టు. 12,(ప్రజా జ్యోతి):** మాజీ అఖిల భారత ప్రధాన కార్యదర్శి, మార్క్సిస్టు మేధావి సీతారాం ఏచూరి 74వ జయంతి సందర్భంగా బుధవారం దమ్మపేటలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు మాట్లాడుతూ దేశంలో మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీతారాం ఏచూరి చూపిన ప్రజా అనుకూల మార్గంలో ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.సీతారాం ఏచూరి ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారని, 1975 ఎమర్జెన్సీ సమయంలో అరెస్టై, ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీని తీవ్రంగా వ్యతిరేకించి తన పోరాట పటిమను చాటుకున్నారని రఘు గుర్తుచేశారు. అనంతరం సీపీఐ(ఎం) పూర్తికాల కార్యకర్తగా, కేంద్ర కమిటీ సభ్యుడిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యుడిగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించిన ఏచూరి, దేశాభివృద్ధి అంటే కార్పొరేట్ల అభివృద్ధి కాదని, సామాన్య ప్రజల అభివృద్ధేనని స్పష్టం చేశారని పేర్కొన్నారు.ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులు, రైతుల పట్ల అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తూ లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్యవతి, ఈశ్వరమ్మ, సత్యవేణి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## పాల్వంచలో దొంగల హల్ చల్

- ఒకే ఈరోజు రెండు ప్రదేశాలలో చోరీకి పాల్పడిన దొంగలు
- 5 తులాల బంగారం, 30 వేల నగదు, ఏసీలను అపహరించకపోయిన గుర్తుతెలియని వ్యక్తులు



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 12, (ప్రజాజ్యోతి )** పాల్వంచ పట్టణంలో రెండు వేరు వేరు ప్రదేశాలలో గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్ళలోకి ప్రవేశించి బంగారు ఆభరణాలను కొంత నగదును అపహరించకపోయిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది , ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి పట్టణ పరిధిలోని ఒడ్డుగూడెం ప్రాంతంలో దొంగలు ఒక ఇంటిని లక్ష్యంగా పెట్టుకొని ఇంట్లో ఎవరూ లేరు సమయాన్ని గమనించి ఇంటికి తాళం వేసి ఉండటంతో ఇంట్లోకి ప్రవేశించి ఐదు తులాల బంగార ఆభరణాలను, 30 వేల నగదును అపహరించకపోయినట్లు సమాచారం, అదేవిధంగా బస్టాండ్ సమీపంలో మార్కెట్ ఏరియాలో వాణిజ్య సముదాయాల వద్ద మూడు ఏసీలను కూడా దొంగలు అపహరించకపోయినట్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది ,ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- విద్యార్థి ఉద్యమాలకు ఏఐఎస్ఎఫ్ దిక్సూచి: షేక్ సాబీర్ పాషా



**ములకలపల్లి, ఆగస్టు 12 (ప్రజాజ్యోతి):** విద్యార్థి ఉద్యమాలకు ఏఐఎస్ఎఫ్ దిక్సూచి అని ఆ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు షేక్ సాబీర్ పాషా అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 1936 ఆగస్టు 12న ఆవిర్భవించిన ఏఐఎస్ఎఫ్ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి నేటి వరకు విద్యారంగ సమస్యలపై పోరాడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ విద్య, ఉపాధి హక్కుల కోసం విద్యార్థులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నూతన విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని, డిగ్రీ పూర్తిచేసిన ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పించేందుకు బీఎన్ఈజీఏ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎంఈఓ, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతో పాటు పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వరక అజిత్, అధ్యక్షుడు ఎస్కే షాహిద్, రాజ్‌కమల్, మానస, నవిత, మెహబూబీ, ధోని, నిఖిల్, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

- అశ్వరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై ప్రశ్నార్థకం
- అత్యవసరంగా వచ్చినా వైద్యం కోసం నిరీక్షణ.. సిబ్బంది తీరుపై బాధితుల ఆవేదన
- ప్రత్యక్ష అనుభవాలను వెల్లడించిన రోగులు.. ఉన్నతాధికారుల తనిఖీలపై సందేహాలు
- ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్న వైద్యులు
- ప్రతిబింబిస్తున్న డీసీహెచ్ఎస్ పర్యవేక్షణ లోపం




# ఆరోపణలు ఎన్నో... స్పందన శూన్యం!

**అశ్వరావుపేట, ఆగస్టు 12 (ప్రజాజ్యోతి):** పేద, సామాన్య ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందించాల్సిన అశ్వరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిపై వరుసగా ఆరోపణలు వస్తున్నా.. పరిస్థితుల్లో మాత్రం మార్పు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన సమయంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో లేకపోవడం, అత్యవసర పరిస్థితుల్లోనూ చికిత్స ఆలస్యం కావడం వంటి అంశాలపై రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నా ఉన్నతాధికారుల నుంచి తగిన స్పందన కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం పెంచాలన్న ప్రజా ప్రభుత్వ ఆశయాలకు వైద్యులే తూట్లు పొడుస్తున్నట్లవుతోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**"నొప్పి తట్టుకోలేక పోయాను": బుచ్చిబాబు**



అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి చేరుకున్నా సిబ్బంది కోసం వేచి చూడాల్సి వస్తోందని బాధితులు చెబుతున్నారు. మంగళవారం ఉదయం కడుపునొప్పితో ఆసుపత్రికి వెళ్లిన తనకు ఎదురైన అనుభవాన్ని అశ్వరావుపేటకు చెందిన బుచ్చిబాబు ఇలా వివరించారు. "ఉదయం 6 గంటలకు కడుపులో నొప్పి రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాను. అక్కడ నర్సులు గానీ, డాక్టర్ గానీ కనిపించలేదు. నొప్పి తీవ్రంగా ఉండటంతో అక్కడున్న వాచ్‌మన్‌ను డాక్టర్ ఉన్నారా అని అడిగాను. గంట ఆగి రావాలని చెప్పారు. నొప్పి తట్టుకోలేక ఆసుపత్రి ప్రాంగణంలోనే తిరుగుతూ ఉన్నాను. ఆ సమయంలో ఓ పత్రికకు చెందిన రిపోర్టర్ వచ్చారు. ఆయనకు నా పరిస్థితి చెప్పాను. తర్వాత ఓ నర్సుతో మాట్లాడి డాక్టర్‌ను పిలిపించారు. అత్యవసర కేసులకు కూడా ఇలాగే చూస్తారా అని అడిగితే వాదన మొదలైంది. ఆ తర్వాత చాలా సేపటికి నాకు ఇంజక్షన్ ఇచ్చారు. ఇంత ఆలస్యం ఎందుకు జరిగిందని రిపోర్టర్ డాక్టర్‌ను అడిగినప్పుడు సరైన సమాధానం ఇవ్వలేదు. ఆ తర్వాత డాక్టర్‌కు అనుకూలంగా ఉన్న మరో వ్యక్తి (మీడియా ముసుగులో ఇక్కడే విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగి ) ని తీసుకొచ్చి ఎదురుదాడి చేసే ప్రయత్నం చేశారు. నర్సులు సెల్‌ఫోన్లతో బిజీగా ఉంటున్నారు. రోగులకు వైద్యం చేయడంపై మాత్రం శ్రద్ధ కనిపించలేదు. నేను స్వయంగా ఎదుర్కొన్న పరిస్థితికి నేనే ప్రత్యక్ష సాక్షిని." బుచ్చిబాబు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు.

**"రక్తం కారుతున్నా పట్టించుకోలేదు": శివ**



మరో ఘటనలో అశ్వరావుపేటకు చెందిన తాపీ మేస్త్రి గాడిచర్ల శివ తన అన్నయ్య అప్పయ్యకు ఎదురైన అనుభవాన్ని వివరించారు. "మా అన్నయ్య నడుస్తూ కిందపడటంతో గాయమై రక్తం కారుతోంది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చాం. నర్సులకు చెప్పి డ్రెస్సింగ్ చేయాలని అడిగాను. 'ఇది మా పని కాదు.. డ్రెస్సింగ్ చేసేవాళ్లు వేరే ఉన్నారు' అని చెప్పారు. వాళ్లు ఎక్కడున్నారని అడిగితే తమకు తెలియదని చెప్పారు. ముగ్గురు నర్సులు అక్కడే కూర్చుని మాట్లాడుకుంటున్నారు. రక్తం కారుతున్నా వెంటనే వైద్యం చేయలేదు. ఇదే పరిస్థితి మరో సందర్భంలో కూడా ఎదురైంది. అత్యవసర కేసు వచ్చినప్పుడు కూడా సిబ్బంది ఇలా వ్యవహరిస్తే పేద రోగుల పరిస్థితి ఏంటి? ఆసుపత్రి పనితీరును ఉన్నతాధికారులు పూర్తిగా సమీక్షించి ప్రక్షాళన చేయాలి."

**డీసీహెచ్ఎస్ పర్యవేక్షణ లోపం?**

రోగులు, వారి బంధువుల నుంచి ఇలాంటి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఆసుపత్రిలో వైద్య సేవల తీరును ఉన్నతాధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జిల్లా స్థాయి అధికారులు ఆసుపత్రిని చివరిసారిగా ఎప్పుడు తనిఖీ చేశారు? రోగుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్న దానిపై స్పష్టమైన స్పందన కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. అత్యవసర విభాగంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండే విధానంలో లోపాలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవడం వల్లే అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. దీనిపై ఆసుపత్రి యాజమాన్యం స్పష్టమైన వివరణ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. వైద్య సేవలపై వస్తున్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, వాస్తవం కాదంటే అధికారికంగా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి అంటే పేదలకు చివరి ఆశ్రయం. అత్యవసర పరిస్థితుల్లోనూ రోగులకు సకాలంలో వైద్యం అందేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డీసీహెచ్ఎస్ స్థాయి పర్యవేక్షణ లోపం కూడా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



### మీడియా ముసుగులో.. కాంట్రాక్ట్ సిబ్బంది!?

అశ్వరావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో కొందరు కాంట్రాక్ట్ సిబ్బంది మీడియా ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకరు ఆసుపత్రిలో భోజనాల నిర్వహణకు సంబంధించిన కాంట్రాక్ట్ పనులు చూస్తుండగా, మరో వ్యక్తి శానిటేషన్ కాంట్రాక్ట్ సిబ్బందికి సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే వీరు మీడియా ప్రతినిధులుగా కూడా వ్యవహరిస్తూ, ఆసుపత్రిలో సమస్యలను తెలుసుకునేందుకు వచ్చే బయటి విలేకరులను అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆసుపత్రిలో రోగులకు ఇబ్బందులు ఎదురైనా విషయాలు బయటకు రాకుండా చూసేందుకు కొందరు అధికారులు, మీడియా ముసుగులో ఉన్న కాంట్రాక్ట్ సిబ్బంది మధ్య సమన్వయం ఉందన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇందులో వాస్తవం ఎంత అన్నది అధికారులు తేల్చాల్సిన అంశం. సంబంధిత కాంట్రాక్ట్ సిబ్బంది విధులు, వారి మీడియా గుర్తింపులు, ఆసుపత్రి ప్రాంగణంలో వారి పాత్రపై ఉన్నతాధికారులు విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# కరెంట్ ఉచ్చుకు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బలి

- వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలకు నవీన్ మృతి
- నకిరేపేటలో విషాదం.. అక్రమ వేటగాళ్ల కోసం గాలిస్తుండగా ఘటన
- ముగ్గురిపై కేసు.. పాల్వంచ సీఐ దర్యాప్తు
- నవీన్ మృతిపై మంత్రి సీతక్క సంతాపం



**బూర్గంపహాడ్, ఆగస్టు 12 (ప్రజా జ్యోతి):** అడవి జంతువుల వేట కోసం అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ఉచ్చు ఓ అటవీ శాఖ ఉద్యోగి ప్రాణాలను బలిగొం ది. వేటగాళ్లు విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారన్న సమాచారంతో అటవీ ప్రాంతంలో తనిఖీలకు వెళ్లిన చెరువు సింగారం వెస్ట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్ ప్రమాదవశాత్తు ఆ తీగకు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందారు. బూర్గంపహాడ్ మండలం నకిరేపేట గ్రామ పరిధిలో బుధవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.

### ››› సమాచారంతో వెళ్లి..

నకిరేపేట పరిధిలో కొందరు వ్యక్తులు వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారన్న సమాచారం అటవీ శాఖ అధికారులకు అందిం ది.కాగా డీఆర్వో కుర్సం అనార్కలి ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్, సిబ్బంది సంఘటనా ప్రాంతానికి వెళ్ళే క్రమంలో వేట కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలను గుర్తించి, సంబంధిత వ్యక్తుల కోసం గాలిస్తున్న సమయంలో నవీన్ ప్రమాదవశాత్తు కరెంట్ వైర్‌కు తగిలినట్లు అటవీ శాఖ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

### ››› విద్యుదాఘాతంతో మృతి...

విద్యుత్ ప్రవాహం ఉన్న తీగకు తగలడంతో నవీన్ తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ ఘటనలో ఆయన మృతి చెందారు. అక్రమ వేటను అడ్డుకునే విధుల్లో భాగంగా అటవీ ప్రాంతానికి వెళ్లిన ఉద్యోగి ప్రాణాలు కోల్పోవడంతో అటవీ శాఖలో విషాదం నెలకొంది.

### ››› ముగ్గురిపై కేసు...

నవీన్ మృతికి కారణమైన విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారన్న ఆరోపణలపై లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆవుల నాగిరెడ్డి, దాసరి నరేష్, తాటి వీరబాబులపై అటవీ శాఖ అధికారులు బూర్గంపహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసి నవీన్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డీఆర్వో కుర్సం అనార్కలి పోలీసులను కోరినట్లు తెలిపారు.

### ››› దర్యాప్తు ముమ్మరం....

అటవీ శాఖ ఫిర్యాదు మేరకు బూర్గంపహాడ్ పోలీసులు కేసు నమోదు చేశారు పాల్వంచ సీఐ సతీష్‌దర్యాప్తు చేపట్టగా విద్యుత్ తీగలను ఎక్కడి నుంచి ఏర్పాటు చేశారు? విద్యుత్ సరఫరా ఎలా అందింది? వేట కోసం వాటిని ఎవరు ఏర్పాటు చేశారు? ఘటన సమయంలో అక్కడ ఎవరెవరు ఉన్నారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు.

### ››› అక్రమ వేటకు కరెంట్ ఉచ్చులు...

వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలను ఉచ్చులుగా ఏర్పాటు చేయడం ప్రమాదకరంగా మారుతోంది. వన్యప్రాణులతోపాటు అటవీ సిబ్బంది, పశువులు, స్థానికుల ప్రాణాలకూ ఇవి ముప్పుగా పరిణమిస్తున్నాయి. అక్రమ వేటను అరికట్టేందుకు వెళ్లిన అటవీ శాఖ ఉద్యోగే కరెంట్ ఉచ్చుకు బలికావడం ఆందోళన కలిగిస్తోంది.

### ››› నవీన్ మృతిపై సీతక్క సంతాపం....

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ మృతిపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన నవీన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు, ఉచ్చులు ఏర్పాటు చేయడం అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలతో జంతువులతో పాటు అటవీ సిబ్బంది, స్థానికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

### ››› అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు...

వన్యప్రాణుల వేటకు ఎవరూ పాల్పడవద్దని, ప్రాణాంతకమైన విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేయవద్దని మంత్రి సీతక్క ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### ››› బాధ్యులపై చర్యలకు డిమాండ్...

ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి నవీన్ మృతికి దారితీసిన పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. అటవీ ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేసే వారిని గుర్తించి అడ్డుకోవడంతో పాటు.. విధి నిర్వహణలో అటవీ సిబ్బంది భద్రతకు మరిన్ని చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# పాఠశాల పూర్వ విద్యార్థికి ఘన సన్మానం



**చర్ల , ఆగస్టు 12 :(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని సత్యనారాయణపురం పాఠశాలలో విద్యాభ్యాసం చేసి ఆర్టీసీలో ఉద్యోగం చేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ప్రముఖ కవి, రచయిత తాతోలు దుర్గా చారిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి. రాజేశ్వరి, ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.చిన్ననాటి నుంచే కవిత్వ రచన, పాటలు పాడటం వంటి అభిరుచులను పెంపొందించుకున్న దుర్గా చారి ఉద్యోగ జీవితంతో పాటు సాహిత్య రంగంలోనూ తనదైన ముద్ర వేశారు. అనేక రచనలు చేస్తూ పలు పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆయనను పూర్వ విద్యార్థిగా పాఠశాల తరపున సత్కరించారు.ఈ సందర్భంగా తాతోలు దుర్గా చారి మాట్లాడుతూ సత్యనారాయణపురం పాఠశాలలో విద్యాభ్యాసం చేసి క్రమశిక్షణతోనే జీవితంలో ఎదిగి ఉద్యోగం సాధించానని తెలిపారు. తన గురువులు నేర్పిన అక్షర జ్ఞానంతోనే కవిత్వం రాస్తూ సాహిత్య రంగంలో కొనసాగుతున్నానని అన్నారు .తనను పూర్వ విద్యార్థిగా గుర్తించి అభినందించి సన్మానించడం ఎంతో ఆనందంగా అదృష్టంగా భావిస్తున్నానని తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు, పెద్దలకు శతకోటి వందనాలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు వి. రాజేశ్వరి, ఉపాధ్యాయులు, సిబ్బంది తాతోలు దుర్గా చారిని అభినందించారు.

# సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతుల అభివృద్ధికి కేటీపీఎస్ సహకారం

- రూ.95.90 లక్షల మూడో, తుది విడత నిధుల చెక్కును జిల్లా కలెక్టర్ అంకిత్‌కు అందజేసిన కేటీపీఎస్ అధికారులు




**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 12 ,(ప్రజా జ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మౌలిక వసతుల అభివృద్ధికి కేటీపీఎస్–7వ దశ సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి రూ.95,90,802ల మూడో , తుది విడత నిధుల చెక్కును కేటీపీఎస్–7వ దశ చీఫ్ ఇంజనీర్ బి. శివరామ్ రెడ్డి జిల్లా కలెక్టర్ అంకిత్‌కు బుధవారం ఐ డి వో సి కార్యాలయం కలెక్టర్ ఛాంబర్ నందు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేటీపీఎస్ సివిల్ విభాగం సూపరింటెండింగ్ ఇంజనీర్ యు. గోపతి పాల్గొన్నారు.కేటీపీఎస్ సీఎస్ఆర్ నిధులతో పాల్వంచ పట్టణంలోని ఇందిరానగర్ నుంచి గిరిజన ప్రాంతమైన జగన్నాధపురం వరకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాల్లోని వివిధ గ్రామపంచాయతీల పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నామని అన్నారు, ఈ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.2,39,70,802 నిధులను కేటాయించా మని, ఇప్పటికే విడతల వారీగా నిధులు విడుదల చేయగా, తాజాగా రూ.95,90,802ల మూడో , తుది విడత నిధుల చెక్కును జిల్లా కలెక్టర్ అంకిత్‌కు అందజేశారు.సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ఆయా ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు దోహదపడనున్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు . ప్రభుత్వ రంగ సంస్థలు సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రాంతాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సీఎస్ఆర్ నిధులను వినియోగిస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు.కేటీపీఎస్–7వ దశ ఆధ్వర్యంలో సీఎ స్ఆర్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తయితే పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి మండలాల పరిధిలోని ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ సదుపాయాలు, విద్యుత్ వెలుగులు అందుబాటులోకి రావడంతో ఆయా ప్రాంతా ల అ భివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడనున్నాయి అన్నారు

# ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలకు పాలించే హక్కు లేదు

- దేశ సంపద కార్పొరేట్లకు ధారాదత్తం
- సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా









**ములకలపల్లి ఆగస్టు 12 (ప్రజాజ్యోతి):** ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబించే ప్రభుత్వాలకు పాలించే హక్కు లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సీపీఐ చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర బుధవారం ములకలపల్లి కి చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలను కలుసుకుని సమస్యలు తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ సంపద, ప్రకృతి వనరులను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూకమామిడి ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టి ఆయకట్టు పెంచాలని కోరారు. మండలంలో గిరిజనులు, గిరిజనేతరులకు సాగు చేసుకుంటున్న సుమారు 3,500 ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూములపై అటవీ అధికారుల దాడులు ఆపాలన్నారు. భూమిలేని పేదలకు ఇళ్ల స్థలాలు, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని, రైతులకు యూరియా, ఎరువులు, పురుగుమందులు నేరుగా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని సాబీర్ పాషా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌డీ సలీం, సరివెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, నారటి ప్రసాద్, చంద్ర నరేంద్రకుమార్, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమాలయ్య, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కందుల భాస్కర్, జి. వీరస్వామి, ఎస్‌కే ఫహీం, ప్రజాసంఘాల జిల్లా బాధ్యులు భూక్యా శ్రీనివాస్, వరక అజిత్, నిమ్మల రాంబాబు, కాటూరి రాము, రత్నకుమారి, కార్పొరేటర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాసంఘాల నాయకులు, ములకలపల్లి మండల కార్యదర్శి ఎం.డి. యూసఫ్, సీపీఐ మండల నాయకులు నారటి రమేష్, వీరు, అనుముల సాయి, పువ్వాల లలిత, రావు, ఎస్‌కే జబ్బార్ తదితరులు పాల్గొన్నారు.